
కథానిక

# కళింగ ఎక్స్‌ప్రెస్

—కొప్పల భానుమూర్తి

పెళ్లికి అలంకరించిన పేదోడి ఇల్లు లాగుంది పలాస రైల్వే స్టేషన్. పలపలాసగ అక్కడక్కడ జనం. జీడిపప్పు ఫేక్టరీల నుంచొస్తున్న నల్లటి పొగలు కారుమబ్బు ల్లాగ పట్టణాన్ని చుట్టుముదుతున్నాయి. వెలుగులు ప్రసరించదానికి అడ్డంగా వున్నాయి.



పట్టాలమీద రైలు పెళ్లికొడుక్కోసం ఎదురుచూస్తున్న పెళ్లి కూతుర్లాగ అలంకరించుకొని వుంది. రైలుపెట్టె తలుపులు తెరిస్తే ఆక్రమించుకోడానికి సిద్ధంగా జనం కాచుక్కూచున్నారు. రిజర్వేషన్ ప్రయాణీకులు తమ పేర్లను చార్ట్‌లో చూసుకొని తృప్తిగా తలాడించుకుంటున్నారు. ప్లాట్‌ఫారం మీద ఆ చివర చెట్లకింద కుటుంబాలతో తరలివెళ్తున్న జనం. సిమ్మెంట్ అంకేలలో సామాన్లు సర్దుకొని రైల్లోకి ఎక్కడానికి తయారుగావున్నారు. ఆడవాళ్లు పిల్లలకి పైటకొంగుచాటున పాలిస్తూ ఒకచోట చేరి మాటల్లో మునిగిపోయారు. మగవాళ్లు బీడీలు ముట్టించి కులాసాగా పొగలు గాల్లోకి వదుల్తూ—

"అయితే గణపతిరావ్ నాయుడు ఓడిపోనాడన్న మాట"

"మరేటి. అవతల పార్టీ కర్రలొట్టుకొని బూతుల కాడ కాపలాకాసినారు—ఇతగాడికి సాలిందికాదు—పదిహేను ఓటుల్లో పోయింది"

"ఎవుడెలగపోతె మనకేట్లేరా—తాగనానికే నీళ్లేవు—అలాటిది నీటికి సంఘాలు, లటికి ఎలచ్చన్లు—"

"బాగన్నావు—ఆ నీరే వుంటే మనమేల ఇలగ వున్నార్నొదిలి—దేశాలంటి ఎందుకు పట్టిపోతాం"

"మా వూల్లో బడిసెపతన్న మేష్టన్నాడ్లే—ఆల నీటిసంగాలు పెడితే, మనం కన్నీటి సంగాలెట్టాలీ అని"

"మా గొప్పగా సెప్పినాడ్రా—ఉద్దానం నిండా కన్నీరే—కన్నీటి సంగాలే ఎట్టాల"

"ఒకుద్దానవేటి—దేశం నిండా కన్నీరే"

"మేం ఇల్లు బయలెల్లుతుంటే మా నాయుడన్నాడు—ఈపాలి జన్మభూమి కార్యక్రమానికి ఊల్లో ఎవ్వుడు మిగలకుండా ఎలిపోతున్నార్రా అని"

"నువ్వేటన్నావ్"

"కడుపు మంటోల్లం మాకు జన్మభూవేటి—ఎక్కడ కడుపుకెంత తిండి దొరికితే అదే మా జన్మభూవి' అనన్నాను.

మైకు గొంతు సవరించుకుంది.

బర్ర్....బర్ర్‌స....బర్ర్....బర్ర్....

"మరి కాసేపట్లో రైల్వే మంత్రి శ్రీ నీలం నాయుడు గారు మన వెనుకబడిన ప్రాంతం నుండి డైరెక్ట్‌గా హైదరాబాద్‌కి రైలుబండిని ఆవిష్కరిస్తారు. అందరూ కుర్చీల్లో కూర్చోవలసిందిగా మనవి"

స్టేషన్లో సందడి మెల్లగా అందుకుంది. ప్రయాణీకులు, కార్యకర్తలు కుర్చీల్లో సర్దుక్కూచున్నారు.

"జ్యాంతికీలై....ఉండ్లై...జ్యాంతికీలై...ఉండ్లై" చెట్ల కింద ఆడుకుంటున్న పిల్లలు వాళ్లతల్లుల దగ్గిరికి పరిగెత్తుకొచ్చి పైట కొంగును లాగి జంతికలు, ఉండల బండివైపు చూపిస్తున్నారు. తల్లులు విరాకుపడ్తూ—

"నోర్ముయండ్రా **ముష్టి గుంటల్లారా**—అందుకేనా ఎంటబడతన్నారు. నాయినమ్మకాడుండిపోండ్రా అంటే కాలెగరేసి ఎంటబడ్డారు. పదండి—పదండి—అక్కడ మేం పప్పకూడు కెళ్లడంలేదు. మీ

దుంపలు దంపిస్తాంపదండి" ఉక్రోషంగా తల్లులు అంటున్నారు. వీపులమీద రెండు దెబ్బలుపడ్డ పిల్లలు ప్లాట్‌పారంమీద రైలు కూతలాగా ఏడుపు అందుకున్నారు.


రైల్వే ఎనౌన్సర్ కమ్మటి గొంతు తియ్యగా పలికింది. "మరికొద్దిసేపట్లో రెండో నెంబర్ ప్లాట్ పారంమీదకు వచ్చును"

ఇంగ్లీష్, హిందీ, ఒకదాని తర్వాత **ప్లాట్‌ఫారం** గేటు దగ్గిర డప్పుల శబ్దం ఖణేల్, ఖణేల్‌మని మోగింది. ఎర్రజెండాలు గాల్లో రెపరెపలాడాయి. పూరి తిరుపతి రైలు వచ్చి పట్టాలమీద ఆగింది. రైలు శబ్దంతో ఎర్ర జెండాల నినాదాలు మిన్నుముట్టాయి.

రైతులపై కాల్పులు–సిగ్గు సిగ్గు

తాగునీరు, సాగునీటి సాధనకోసం–చలో విశాఖ

రైతాంగ సమస్యల సాధనకోసం–చలో–చలో విశాఖ



ఎర్రజెండాలన్నీ ప్లాట్‌పారంమీద కూర్చున్నాయి. డప్పులన్నీ నేలమీద విశ్రాంతి తీసుకుంటున్నాయి.

రైలు వెళ్లిపోయింది. రెండో నెంబర్ ప్లాట్‌ఫారం ఖాళీ అయిపోయింది. తోపుడు బళ్లవాళ్లు చిల్లర లెక్కబెట్టుకుంటున్నారు.

మైకు మళ్లీ గొంతు విప్పింది.

"మంత్రివర్యులు బంగ్లా నుండి బయల్దేరారు. మరి కాసేపట్లో ఇక్కడకు చేరుకుంటారు"

అంతవరకు అక్కడా, ఇక్కడ హస్కు కొడుతున్న వాళ్లంతా కుర్చీల్లో చేరారు. మంత్రిగారు రాగానే ప్రత్యేకంగా మాట్లాడ్డం కుదుర్తుందో, లేదోనని కొందరు ఆందోళన చెందుతున్నారు.

"అయినా ఆ విషయాలు ఇక్కడ మాట్లాడ్డం తెవుద్దా"

"అవదనుకో–కానీ, ఇలగొదిలిస్తే మనం వ్యాపారాలు చేసినట్టే. జీడిపిక్క బస్తాకి మూడువేలు పెట్టి కొనాలంటే మాట్లేటి.

"కొంతకాలం కొండం మానిస్తే"

"ఎంతకాలం–కొనకపోతే ఆలు ఊరుకోడంలేదుకదా–ఉత్తరాలు పెడతన్నారు. కొనక వీల్లేదని లోపల్నుండి కబుర్లు– ఇలగే మొండికేసిన మన ధర్మరాజు సినిమాహాలు తగలెట్టేశారు. మరొకళ్ల ఐస్‌ఫేక్టరీ, ఇంకకరి జీడిపప్పు ఫేక్టరీ కూడా తగలెట్టినారు"

"పోలీసులేంజేస్తన్నారు"

ఈలవల్ల కాదులే–అన్నల్తోటి మనకెందునే అని ఈలు చూసి చూడనట్టు పోతున్నారు. మిలట్రీ మళ్లీ రావాలి. ఆ **విషయాన్నే** మంత్రిగారితోటి మాట్లాడాలి"

గేటు దగ్గిర కలకలం రేగింది. జయజయధ్వానాలు వినిపించసాగాయి.

"పేద ప్రజల ఆశాజ్యోతి శ్రీ నీలం నాయుడుగారు–జిందాబాద్ జిందాబాద్"

"ఉత్తరాంధ్ర వీరకిశోరం–మన కేంద్ర మంత్రి శ్రీ నీలం నాయ్డుగారు జిందాబాద్–జిందాబాద్"

ఫోటోఫ్లాష్‌లు, వీడియో వెలుగులు జిగేల్‌మంటున్నాయి. పూలదండలమ బరువుతో మంత్రిగారు ఉక్కిరిబిక్కిరౌతున్నారు. నేరుగా సమావేశం స్థలం దగ్గిరకొచ్చి కుర్చీలో కూర్చున్నారు మంత్రిగారు. మంత్రితోపాటే **వచ్చిన** అసెంబ్లీ మిత్రపక్ష నాయకుడు ఎర్రచొక్కా ధరించి కుర్చీలో తళతళ మెరిసిపోతున్నాడు. ఎవరో మైకు అందుకొన్నారు–

"ప్రియతమ నాయకుడు–పేదల పెన్నిది శ్రీ నీలం నాయ్డుగారు ప్రత్యేకంగా మన వెనుకబడ్డ ప్రాంతం నుండి నేరుగా రాజధానికి ఈ కళింగ ఎక్స్‌ప్రెస్ వేయడం అంటే కన్న తల్లి రుణం తీర్చుకోవడమే...

జనంలో ఎవరో గుసగుస మాట్లాడుకొంటున్నారు.

"వెనుకబడిన ప్రాంతంలోని ప్రజలకి రాజధానిలో అన్ని రాచకార్యాలుంటాయా"


"ఏలుండవ్–ఇందంట కదువు జరక్కపోతే హైదరాబాద్ పోయి పన్లు ఎతుక్కోవద్దా!"

మళ్లీ మైకులో గంభీరంగా...

"తనకి ఓట్లేసి గెల్పించిన ప్రజలంటే శ్రీ నీలం నాయుడుగారి గొప్ప అభిమానం. ఆ అభిమానాన్ని ఆయన ఈవిధంగా **చాటుకున్నారు**"

నీలం నాయుడుగారు కుర్చీలో కూర్చొని ఎవళ్లతోనో ఏదేదో మాట్లాడుతున్నారు. ఒకళ్ల తర్వాత ఒకరు. మాట్లాడిన ప్రతిఒక్కరికి మంత్రిగారు హామీ ఇస్తున్నారు. అందరి మొహాలు తృప్తిగా వెలిగిపోతున్నాయి.

"శ్రీ మంత్రిగారు ముందుగా రైలుని పచ్చజెండాతో ప్రారంభించి ఆ తర్వాత ప్రసంగిస్తారు"




మైకు.

మంత్రిగారు కదిలారు. అతనివెంటే అందరూ అతిరథులు, మహారథులు, జనం కేకలు, నినాదాలు ప్లాట్‌ఫారం దద్దరిల్లిపోతుంది.

కళింగ ఎక్స్‌ప్రెస్ తలుపులు తెరుచుకున్నాయి. అంతవరకు చెట్లకింద కాలక్షేపం చేస్తున్న జనంలో చైతన్యం వచ్చినట్లయ్యింది. నేలమీదున్న మూటలు జనం నెత్తిమీదకెక్కాయి. రైలు పెట్టెలవైపు పాదాలు పరుగులుతీస్తున్నాయి. తెరుచుకున్న పెట్టెల్లోకి ఎగ ప్రాకడానికి జనం ఒకళ్లనొకళ్లు తోసుకుంటున్నారు.

మంత్రిగారు కొబ్బరికాయ కొట్టారు. పంతులు మంత్రాలు చదువుతున్నాడు. పచ్చజెండా గాల్లో అలా అలా నింపాదిగా ఊగింది. జనం చప్పట్లు.

రైలు కూతవేసింది-కూతను మించిపోయి జనం ఈలలు. కేకలు, గోలగోల. రైలు చక్రాలు మెల్లగా కదిలాయి. రైలు పెట్టెల దగ్గిర మరింతగా తోపుడు ఎక్కువైంది. కొంచెం దూరం వడిచి రైలు ఆగిపోయింది.

మంత్రిగారు మైకందుకున్నారు.

"ప్రియతమ ప్రజలారా-ఈ రైలు ప్రారంభించి నేడో ఈ ప్రాంతానికి మేలు చేశానని అంటున్నారు. నిజానికి నా కర్తవ్యాన్ని నేను నెరవేర్చాను. మనం అందరం మన ముఖ్యమంత్రిగారికి కృతజ్ఞతలు చెప్పాలి. ఎందుకంటే అతడు మనకోసం పగలు, రాత్రి శ్రమిస్తున్నారు. రైతు సంక్షేమంతోటే దేశాభి వృద్ధి ముడిపడివుందన్న విషయం గ్రహించిన ఏకైక ముఖ్యమంత్రి. అందుకే అతడు రైలు సంక్షేమ సదస్సులు ఊరూరా పెడుతున్నారు"

జనంలో ఇద్దరు మెల్లగా మాట్లాడుకుంటున్నారు.

"అందుకే రైతులపై కాల్పులు జరిగినాయి"

"మరెక్కడా లేనివిధంగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు ఇక్కడే"

"ఉష్...దయచేసి మీలో మీరు మాట్లాడుకో వద్దు" ఎవరో గట్టిగా గద్దించారు. జనం నిశ్శబ్దంగా మారిపోయారు.

"అందులో భాగంగానే ఈరోజు విశాఖపట్నంలో జరిగే ఉత్తరాంధ్ర రైతు విజ్ఞాన సదస్సుకు ఈ ప్రాంతం నుండి కనీసం వెయ్యి మందికి తక్కు వగా కాకుండా హాజరుకాలసిందిగా ప్రార్థన. అలా వెళ్లే వాళ్లందరికి రైల్లు, బస్సులు ఉచితంగా తీసుకెళ్లే ఏర్పాట్లు చేశాం"

జనం చప్పట్లు-జయజయ నినాదాలు

తప్పక ఈ అవకాశాం వినియోగించుకోమని నా మనవి. జైహింద్-జై ముఖ్యమంత్రి"

కేంద్ర మంత్రిగారు కూర్చుండిపోయారు. మిత్ర పక్షం నాయకుడు మైకు అందుకున్నారు.

"మహాజనులారా..ఈరోజు ఈ రైలు ప్రారం భంలో నేను పాల్గొనడం నాకు గొప్ప గౌరవం.ప్రజా సమస్యల పరిష్కారం కోసం పార్టీలు పనిచేస్తు న్నాయని మీకు మనవి చేస్తుండ. అందుకే మాకు ప్రభుత్వం స్థాపించే అవకాశం వచ్చినా అధికారం జోలికి వెళ్లకుండా ప్రతిపక్షంలోనే కూర్చున్నాం అని మనవి చేస్తుండ...."

జనంలోంచి-"అదేం పాపం"

"అయితే-మన ప్రభుత్వాలు ఎవ్వరైనా ప్రజా వ్యతిరేక పనులు చేపడితే వెంటనే ధర్నాలు, ఊరే గింపులు పెట్టి హెచ్చరిస్తున్నాం. ఈ మధ్య పెరిగిన ధరల కోసం ఊరూరా ధర్నాలు చేసిన సంగతి మీకు తెలుసు

మళ్లీ జనంలో గుసగుసలు-

"అందుకే ఎవరో మహానుభావుడన్నాడు. 'ఈళ్లు ప్రభుత్వం అనే బండి ఆగిపోతే తోస్తారు. కదిలితే విమర్శిస్తుంటారు' అని"

రైలు పెట్టెల దగ్గర కలకలం ఇంకా కొనసాగు తూనే వుంది. ప్లాట్‌ఫారంకి ఆ చివర కూర్చున్న ఎర్రజెండాలన్నీ లైనుగా కదిలాయి.

ఎర్రజెండాలన్నీ నినాదాలిస్తూ ఇటే వస్తున్నాయి. సభాస్థలి ఖాళీ అయింది.

"ఏయ్....ఇది రిజర్వేషన్ కంపార్ట్‌మెంట్.."

"లోపల్నుండి ఎవరో గదమాయిస్తున్నారు"

"ఏ పెట్టె ఖాళీ లేదు. ఏం చెయ్యమంటారు" నింపాదిగా చెప్పాడు ఎర్రజెండా పట్టుకున్న మనిషి.

"ఖాళీ లేకపోతే మానీవయ్య-పెద్ద టిక్కెట్టు తీసుకున్నోడ్లాగా-రిజర్వేషన్ పెట్టెలోకి వస్తున్నారు" కులాసాగా కూర్చున్న మనిషి విరాకు

"ఎందుకు టిక్కెట్టు తీస్కోవాలి" ఎర్రజెండా ప్రశ్న

"అవున్లే. నువ్వెందుకు తీస్తావ్. ఎల్లెల్లు-అటు జనరల్ బోగీ ఉంటాది. అందులోకి ఎక్కండి" కులాసా గొంతు కసుర్లు

"ఎక్కడికి వెళ్లొద్దు-అందరూ దీంట్లోకే ఎక్కుదాం"

ఎర్ర జెండాలన్నీ పెట్టెలోకి ఎక్కేయి. సీట్లమీద కూర్చున్న వాళ్లు విస్తుబోతూ జనంవైపు చూస్తు న్నారు.

"ఇదెక్కడి అన్యాయం. మేం ఇంతేసి సొమ్ము ఎగస్ట్రా పోసి రిజర్వేషన్ చేయించుకున్న ఫలితం ఏంటి" ఎవరో బాధగా అంటున్నారు.

"ఏంటయ్యా మీ దౌర్జన్యం. పెద్ద డబ్బిచ్చి టిక్కెట్టు కొన్నట్టు" అక్కసుగా ఎవరిదో ప్రశ్న

"ఆ డబ్బు సృష్టిస్తున్నోళ్లంమేం-మేమెందుకు టిక్కెట్టు తియ్యాలి" ఎర్రజెండా జవాబు

"అల్లగైతే మీ కోసం ప్రత్యేకంగా ఓ రైలు వేసుకొండి" మరో గొంతు ఉక్రోషంగా-

"ప్రత్యేకంగా ఎందుకు. ఇదేమాది. దీన్ని వేసింది మేమే" ఎర్రజెండా నింపాదిగా సమాధానం.

డప్పు ఖణేల్, ఖణేల్ మంది

గజ్జెలు ఘల్లు ఘల్లుమన్నాయి.

గేంగొల్ల మండి బాబు మేము-

గరీబోల్లమండి బాబు మేము-

మానెత్తురంత ధారపోసి-

రైలు పట్టాలేసినాం-గేంగోల్ల నుండి బాబు మేము-

బెర్తులమీద పడుకున్న జనం ఒక్కసారిగా లేచి కూర్చున్నారు. పాటకిలయబద్ధంగా చప్పట్లు కొడు తున్నారు.

ఎవరో ఎర్రజెండాని తలుపుకి కట్టారు. అది గాల్లో వయ్యారంగా ఎగురుతోంది. పాట పూర్తైంది. జనంలోంచి ఓ గొంతు ఖంగుమంది.

మీరెత్తిన ఎర్రజెండా-మేం పడతాం చేతినిండా-

దిక్కు ముక్కులేని జనం-ఒక్కొక్కరు అగ్గి కణం

రైలుకదిలింది-పలాసా రైలు స్టేషన్ దాటి స్పీడు అందుకుంది. ప్రతి పెట్టె జనంతోటి పిట పిటలా డుతుంది. నిల్చోడానికి కూడా ఖాళీలేదు. కొందరు తలుపుదగ్గిరున్న గజం పట్టుకొని వేళ్లాడుతున్నారు. లోపల టాయిలెట్స్ దగ్గిర కొంచెం జాగా దొరికి ఇద్దరు మాట్లాడుకుంటున్నారు-

"వైజాగ్‌లో దిగిన వెంటనే-మనం జనంలోంచి ఇడిపోవాలి"

"ఏం-ఎం..దుకు"

"ఎందుకంటేవేట్రా-సిమ్మాసెలం ఎల్లవేటి"

"ముఖ్యమంత్రిని సూడం రా-"

"అవన్నీ పెట్టుకుంటే మన మొక్కుబడి తీరి నట్టే. నా మాటిను సింహాసెలం బస్సెక్కి, గుండు గీయించుకొని దర్శనం చేసుకొని మళ్లీ సాయంకాలానికి తిరిగి టేసన్‌కాడికి ఎలిపారావలి లేకపోతే మళ్లీ టిక్కెట్టు కొనాలి-తెల్సిందా"

జనం మధ్యలోంచి ఎవరిదో చంటిపిల్లాడి ఏడుపు హృదయ విదారకంగా వినిపిస్తుంది. పిల్లాడ్ని బోధ పెట్టడానికి తల్లి విశ్వప్రయత్నం చేస్తుంది....ఏడుపు ఆగడంలేదు. రైలింజన్ రొదను మించిన ఏడుపు.

"లేదు, లేదు-మామయే. పల్లకో-పల్లకో..."

"అదిగదిగో బూసోడు-అల్గా కిటికీలోనుంచొస్తున్నాడు-పల్లకో-పల్లకో...."

ఏడుపు ఆగడంలేదు. ఇంకా ఎక్కువవుతుంది.

"చపక్...చపక్...చపక్...." బిగ్గరగా చప్పట్లు-అందరూ అటు చూశారు.

"జంటిల్మెన్-మీకు ప్రయాణంలో టైంపాస్ కోసం కొంచెంసేపు ఈ వేలంపాట-ఇంటరెస్ట్ వున్నవాళ్లు పాడొచ్చు. బహుమతుల్ని పొందొచ్చు...."

పసిపిల్ల ఏడుపు ఇంకా కొనసాగుతూనే వుంది.

"ముష్టిగుంట పేనం తీసెస్తది. అవతలకి ఇసిరిద్దునా-సీడొదిలిపోద్ది" తల్లి అసహాయత, కోపం.

"పాలు పెట్టొచ్చు కదమ్మా-"ఎవరిదో ఉచిత సలహా.

ఎండిన రొమ్ములనుండి పాలబొట్లు రాలాయో లేదో కానీ, ఆ తల్లి కళ్లనిండి రెండు కన్నీటి చుక్కలు జాకెట్టుమీద పడ్డాయి.

"నాయినా...నీ వున్నిముంతాది. అల్గా నీలు కొంచిం ఇయ్యవా...బాబ్బాబు"

"అమ్మో-ఇది మామ్మూలు నీలు కావమ్మా-మినరల్ వాటర్. బోటిల్ పద్దెనిమిది రూపాయలు.

ఆ తల్లికి ఏమీ అర్థంకాలేదు.

"పక్క స్టేషన్లో బండగాగుద్ది ఎల్లి తాగించు"

బండి స్లో అయింది. జనం నినాదాలు బండికి ప్లాట్ ఫారంమీదకి స్వాగతం పలుకుతున్నాయి.

'మద్దు వల్స రిజర్వాయర్ పనులు-
తక్షణం చేపట్టాలి"

"ఉత్తరాంధ్ర రైతు వలసలు-నివారించాలి"

"రైతాంగ సమస్యల సాధన కోసం-చలో విశాఖ-

బండి పూర్తిగా ఆగింది. తలుపు దగ్గిర జనం తోపులాట మళ్లీ మొదలయ్యింది.

'చచ్చాం. మళ్లీ ఈ జనం కూడా ఈ పెట్టె ఎక్కుతారుగావాల' ఎవరి గొంతులోనో భయం.

బండి మెల్లగా కదిలింది. ఎక్కడ్నుంచి వచ్చారో వందలాది మంది పరిగెత్తుకొచ్చి రైలు పట్టాలకి అడ్డంగా పడుకున్నారు. నల్లజెండాలు గాల్లో ఊపుతూ పరిగెత్తుకొస్తున్నారు. వాళ్ళ వెంట పోలీసులు తరుముతున్నారు.

'అంబేద్కర్‌ని అవమానించిన వాళ్లని శిక్షించాలి

'అగ్రకుల దురహంకారం నశించాలి'

జనం కేకలు. గోలలు. పోలీసులు వాళ్లని తరుముతున్నారు. బండి మళ్ళీ ఆగిపోయింది.

'కులవృత్తులున్న మాదిగల్ని బిసిల్లో చేర్చాలి'

'అంబేద్కర్ అవమానం మేం సహించం' పట్టాల మీద పడుకున్న వాళ్లని పోలీసులు లాఠీలతో కొడుతున్నారు. వాళ్లు దెబ్బల తాకిడికి పరిగెడుతున్నారు. నల్లజెండాలు పట్టుకొని జనం టౌనుమీదపడ్డారు.

రైలు నెమ్మదిగా కదిలింది.

అక్కడ బండి ఎక్కిన వాళ్ళు మెల్లగా నిల్చోడానికి చోటుచేసుకున్నారు.

'ఇంత బాధపడి ఎల్తన్నాం. హైదరాబాద్‌లోన ఎల్లినెంటనే పని దొరుకుతాదా' ఎవరిదో అనుమానం.

'ఎందుకు దొరకదురా. ఎంతమంది వున్నా అక్కడ పనికి లోటుండదెస్.'

సందేహం నివృత్తి కావడంతోటి ఊరుకుండిపోయాడు అడిగినతను.

'హైదరాబాదునిండా మన సికాకొలం జనమేన్రా. బోరబండ, బాలానగర్, కూకట్‌పల్లి, జీడిమెట్ల, బొల్లారం అందంటందరూ మన జనమే. మనం సికాకుళంలోనున్నట్టే వుంటాది' అనుభవంతో చెవుతున్నాడు.

తృప్తిగా తలాడించి వూరుకుండుపోయాడు.

రైలుబండి స్పీడందుకుంది. వంపులు తిరిగిన వ్రుదు కుబుసం విడిచిన నాగుపాములా వంపులు తిరిగి పరిగెడుతుంది. అక్కడక్కడా కిటికీలవి, తలుపులవి కట్టిన జెండాలు రెపరెపలాడుతున్నాయి. బండి చిన్న చిన్న స్టేషన్లలో ఆగకుండా పరిగెడుతుంది. కాలువలు, నదులు దాటుకుంటూ పరిగెడుతుంది. పల్లెలు, పట్నాలు దాటుకుంటు పరిగెదుతుంది.

కళ్లంట నీళ్ళు తెప్పించే దృశ్యం. కన్నీళ్ళు నదీ ప్రవాహాలై పారే సన్నివేశం. కన్నీళ్ళు కంట తడి పెట్టే సంఘటన.

చెల్లాచెదురైన రైలు పెట్టెల మధ్య మానవాకారాల మూలుగులు. విగత జీవులపైనబడి అయినవాళ్ల ఏడుపులు. పరామర్శకొచ్చిన పెద్దమనుషుల మొసలి కన్నీళ్లు. ఫోటో ఫ్లాష్‌లు, టీవీ కెమెరా కళ్లు.

అక్కడంతా బిజీగా వుంది. మాటలు కూడా అక్కడమవునంగానే వున్నాయి. పోలీసు బందోబస్తు మధ్య స్టేషన్ మాస్టర్. ఏకధారగా కారుతున్న కన్నీటితో టివికి ఇంటర్వ్యూ ఇస్తున్నాడు. మధ్య మధ్యలో వెక్కివెక్కి ఏడుస్తున్నాడు.

'ఇంత ఘోరం నేనెప్పుడూ చూళ్లేదు. నా సర్వీసులో ఇదేమొదటిసారి. ఇంతమంది చావుకి కారకుణ్ణి నేనే... నేనే.. నేనేనా! ఎందుకో నా బుర్ర సరిగ్గా పన్చేయ్యలేదు. అట్నుంచి కేంద్ర మంత్రిగారి బండి. దానికి ముందు లైనివ్వాలి. ఇచ్చానురా. ఇచ్చానా... ఆహా ఇవ్వలేదు. ఇట్నుంచి సి.ఎం.గారి బండికిచ్చానరు. సరిగ్గా అదే టైంలో పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడి జనచైతన్య యాత్రా బండి. స్టేషన్‌లోనే పబ్లిక్ మీటింగ్. ఏటో. అంతా గందరగోళం. అప్పుడే బొకారో నుంచి గుడ్సు బండి వచ్చింది. ఈ బండి వచ్చింది. రెండు ఒకేలైను మీద' స్టేషన్ మాస్టర్ ఏడుస్తున్నాడు. అతడి మాట తొట్రుపడుతుంది. అతణ్ణి పోలీసులు తీసుకెళ్లి వేను ఎక్కించారు. ఇంతమందిని చంపేశాను గొణుక్కుంటున్నాడు స్టేషన్ మాస్టర్.

శవాలని అంబులెన్స్ ఎక్కిస్తున్నారు. కడుపుమంటోళ్ల ఆకలి బాధ తప్పిపోయింది.

